క్లుప్తంగా

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



కనకదుర్గమ్మకు భక్తులు సమర్పించిన సారె

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో శనివారం భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. విశ్వహిందూ పరిషత్ ప్రచార కమిటీ సభ్యులు ప్రభాకర్‌రావు, నాయకులు రామకృష్ణ, భక్తులు 30రకాల స్వీట్లు సమర్పించారు. తొలుత భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

గోపన్నపాలెంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం థైరాయిడ్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు రాకేష్, రోజ్ మేరి అన్నారు. గోపన్నపాలెం వైద్యశాల పరిధిలో గ్రామ శివారు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి బీపీ, సుగర్ పరీక్షలతో పాటు థైరాయిడ్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశామని స్పష్టం చేశారు. ఈ మేరకు వారికి అవసరమైన మందులు అందజేశామని వివరించారు.

కొబ్బరి ఉత్పత్తుల అమ్మకాలు ఆదర్శనీయం



కొబ్బరి ఉత్పత్తుల అమ్మకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: తక్కువ ధరలకు కొబ్బరి ఉత్పత్తులతో పాటు పది రూపాయలకే వెజ్ బిర్యానీ అమ్ముతున్న ఆదర్శ రైతు వీరమాచినేని శివాజీ అభినందనీయులని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం వీరమాచినేని పుష్ప కల్యాణ మండపం వద్ద ఆదర్శ రైతు ప్రారంభించిన కొబ్బరి ఉత్పత్తులు, వెజ్ బిర్యానీ అమ్మకాలను ఆమె పరిశీలించారు. పదార్థాల రుచి నాణ్యత పరిశుభ్రత సంతృప్తికరంగా ఉన్నాయని అభినందించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్

దెందులూరు: విద్యార్థుల్లో తరగతి సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని దెందులూరు ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.రమేష్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల, స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను సమీక్షించాలన్నారు. చల్లచింతలపూడి ప్రధానోపాధ్యాయురాలు మల్లేశ్వరి పాల్గొన్నారు.

సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు: విద్యార్థులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై అప్రమత్తంగా ఉండాలని, లేనిపక్షంలో జీవితంలో తీరని నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. భీమడోలులోని మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ఇన్‌లైన్ యాప్‌లు, పోక్సో యాకట్ వంటి వాటిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పరిచయాల పేరిట జరుగుతున్న మోసాలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, గ్రామకార్యదర్శి కేవీ తనూజ పాల్గొన్నారు.

బస్టాండ్ ఇక్కడ.. బస్సులు ఆగేది అక్కడ

- ఉంగుటూరులో వింత పరిస్థితి
- బస్టాండ్ వద్ద బస్సులు ఆపని వైనం



బస్టాండులో బిచ్చగాళ్లు నిద్రిస్తున్న దృశ్యం



ఉంగుటూరు ప్రధాన సెంటర్‌లో బస్సు దిగుతున్న ప్రయాణికులు

ఉంగుటూరు: సాధారణంగా ఏ గ్రామంలోనైనా బస్టాండ్ ఎదుటే ఆర్టీసీ బస్సులు నిలుపుతూ ఉంటారు. ప్రయాణికులు కూడా బస్సు ఎక్కాలంటే బస్టాండ్ వద్దకు వెళ్తూ ఉంటారు. కానీ ఉంగుటూరు గ్రామంలో ప్రయాణికులకు వింత పరిస్థితి ఎదురవుతుంది. బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులు నిలుపకుండా రైల్వే గేటు సెంటర్‌లో బస్సులను ఆపడంతో ప్రయాణికులు అక్కడ నుంచే బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి. గ్రామంలో తాడేపల్లిగూడెం వైపు వెళ్లే బస్టాండు ఒక చోట, బస్సులు నిలిపేది మరోచోట అన్నట్లు పరిస్థితి తయారైంది. దీంతో గ్రామంలో నిర్మించిన బస్టాండ్ బిచ్చగాళ్లకు ఆవాసంగా మారుతుంది. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది.

ఇదీ పరిస్థితి

నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రమైన ఉంగుటూరులో ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారుతుంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సులు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో గతంలో గ్రామ పంచాయతీ నిర్మించిన బస్సు షెల్టరు ఉండేది. క్రమేపి జాతీయ రహదారి విస్తరణ, సర్వీసు రహదారి విస్తరణ సమయంలో బస్సుషెల్టరును హైవే అధికారులు తొలగించారు. అయితే సర్వీసు రహదారి నిర్మాణం పూర్తయ్యాక బస్టాండును హైవే అధికారులు ప్రధాన సెంటర్‌కు కొంత దూరంలో నిర్మించారు. అయితే పాత బస్సుషెల్టరు ఉన్న ప్రాంతం వద్ద నుంచే ప్రయాణం చేయడం ప్రయాణికులకు అలవాటు అయిపోయింది. చాలా మంది ప్రయాణికులు అక్కడే నిలబడి ప్రయాణం చేస్తున్నారే తప్ప కొత్తగా నిర్మించిన బస్టాండు వద్దకు రావడంలేదు. ఆర్టీసీ డ్రైవర్లు కూడా ప్రధాన బస్టాండ్ వద్ద బస్సులు నిలుపకుండా ప్రయాణికులు కోరిన చోటే నిలపడం అలవాటు చేసుకున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

బస్టాండ్ నుంచి కూతవేటు దూరంలో ఉన్న రైల్వేగేటును వేసిన సమయంలో వాహనాలు ఇంచుమించు ప్రధాన సెంటర్ వరకు నిలిచిపోతున్నాయి. ఈ సమయంలో బస్సు నుంచి దిగాలన్నా, ఎక్కాలన్నా ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ వద్దే బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది



ఉంగుటూరులో బస్టాండు నిరుపయోగంగా మారుతుంది. హైవే అధికారులు కట్టించిన బస్టాండ్ వద్ద బస్సులు ఆపడం లేదు. ప్రయాణికుల్లో కూడా మార్పు రావాలి. బస్టాండు వద్ద ప్రయాణికులు ఉంటే బస్సులు ఆపుతారు కాబట్టి అక్కడే బస్సు ఆపాలని డ్రైవర్లకు సూచించాలి. ఆర్టీసీ అధికారులు కూడా ఈ మేరకు డ్రైవర్లకు ఆదేశాలు ఇవ్వాలి.

– కొరిపల్లి వెంకట అప్పారావు, ఉంగుటూరు

గణపవరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

గణపవరం: ప్రయాణికులు, విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా వాహన డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని గణపవరం సీఐ నక్కా రజనికుమార్ అన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా గణపవరం సెంటర్‌లో ఆటోడ్రైవర్లు, స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గణపవరం ఎస్సై మణికుమార్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

భీమడోలు: మండలంలోని పూళ్ల పంచాయతీ పరిధి ఎంఎంపురం గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన ఘంటసాల నాగలక్ష్మీ ఈ నెల 7న ఇంటినుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగలక్ష్మీ కుమారుడు చిన్న శంకర్ వివాహమై భర్తతో విడిపోయిన మహిళను పెళ్లి చేసుకుంటానని చెప్పినందుకు మనస్తాపం చెంది ఇంటినుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతూ ఆర్డీఓ అచ్యుత అంబరీష్

ఉంగుటూరు: నియోజకవర్గంలో 2 లక్షల 6 వేల 640 మంది ఓటర్లు ఉన్నారని ఏలూరు ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్ వెల్లడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ కుటుంబంలో ఉండే సభ్యులు ఒకే పోలింగు కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 1200 ఓటర్లు కంటే ఎక్కువ ఉన్న ఓటర్లకు మరో బూత్ గ్రామంలోనే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. అనంతరం ఆర్డీఓ అంబరీష్ మాట్లాడుతూ నాయకుల డిమాండ్లను ప్రభుత్వానికి నివేదికను పంపుతామని తెలిపారు. నియోజకవర్గంలో మగ ఓటర్లు 101649 మంది, మహిళాఓటర్లు 104985 మంది ఉన్నారని, ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు ఉన్నారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌లు పూర్ణచంద్రప్రసాద్, బొద్దేపల్లి ప్రసాద్, ఎన్నికల డీటీ పోతురాజు, రాజకీయ పార్టీల నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, వేమలపల్లి సుదీర్, యెలిశెట్టి పాపారావు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు



యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు: అప్పులు బాధ తాళలేక ఆత్మహత్యాయత్నం చేస్తున్న ఓ యువకుడిని శనివారం భీమడోలు పోలీసులు కాపాడారు. వివరాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలుకూరిపేటకు చెందిన యువకుడు గుంజి వెంకట హరికృష్ణ కొన్ని కారణాల రీత్యా సొంత గ్రామంలో రూ.7 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేందుకు గ్రామాన్ని విడిచి ఉంగుటూరు టోల్‌ప్లాజాలో డ్రైవర్‌గా పని చేస్తూ అప్పుల వాళ్లకు నెలవారీగా కొంత నగదును చెల్లిస్తున్నాడు. అయితే అప్పుల వాళ్ల నుంచి ఒత్తిడి పెరగడంతో తట్టుకోలేక భయపడి తన ఇంట్లో చెప్పి భీమడోలు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి 112 కాల్ చేయడంతో భీమడోలు పోలీసులు యువకుడు ఉన్న స్థలానికి చేరుకుని అతడిని కాపాడారు. అనంతరం యువకుడిని భీమడోలు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి డీఎస్పీ శ్రావణ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, హెచ్‌సీ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన వంతెన అప్రోచ్ రోడ్డు



కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురంలోని పుప్పాల వారి కోడు వద్ద కొత్త వంతెన నిర్మాణం జరుగుతుండగా... నీటి ఉధృతికి వాలుకోడు వంతెన వద్ద శనివారం రోడ్డు కోతకు గురైంది. దీనితో వ్యవసాయ పనులు నిమిత్తం రాకపోకలు సాగించే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కోతకు గురైన ప్రాంతాన్ని శనివారం పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, గుండుగొలను సెక్షన్ డీసీ గంధం లక్ష్మణ్, గ్రామ పెద్ద పుప్పాల హారీష్‌లు పరిశీలించారు. కోత ప్రాంతం అప్రోచ్ రోడ్డును పటిష్టం పర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని డీఈ వారికి హామీ ఇచ్చారు. సంబంధిత కాంట్రాక్టర్ అవగాహన రాహిత్యంతో నిబంధనలు పాటించకపోవడంతో ఇటీవల వర్షాలకు ఒక్కసారిగా వస్తున్న నీటి ఉధృతికి వాలుకోడు వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు ధ్వంసమైందని రైతులు చెబుతున్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఉంగుటూరు: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సదరం సర్టిఫికెట్ల జారీలో జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్యులకు సూచించారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనకు ప్రణాళికలు తయారు చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. శనివారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వాయిస్ క్లోనింగ్ స్కామ్‌లో చిక్కుకోవద్దు

దెందులూరు: ఏ ఒక్కరూ వాయిస్ క్లోనింగ్ స్కామ్‌లో చిక్కుకోవద్దని దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. శనివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక మోసాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మీ సన్నిహితుల గొంతుతో ఎవరైనా ఫోన్ చేసి అత్యవసరంగా డబ్బు అవసరమని ఫోన్ చేస్తే ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని సూచించారు. ఏఐ సాయంతో ఇలాంటి స్కామ్‌లో ఇటీవల బాగా పెరిగాయన్నారు. అపరిచిత నెంబర్ల నుంచి మీ స్నేహితులు, బంధువుల వాయిస్‌తో ఫోన్ కాల్స్ వస్తే నేరుగా వారి సొంత నెంబర్లకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు.

వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారం నారాయణపురం వంతెనను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిధులు, టెండరు స్టేజీ తదితర విషయాలను ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక కో-ఆపరేటివ్ సొసైటీలో ఎరువుల స్టాకు పొజిషన్ అమ్మకాలు వివరాలు ఆకస్మికంగా ఆమె తనిఖీ చేసి తెలుసుకున్నారు.

22న ఏలూరులో ఉద్యోగ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కేరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్), ఏపీఎస్‌ఎస్‌డీసీ సంయుక్తంగా ఈ నెల 22న మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా ఉపాధికార్యాలయం, ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.

పాఠశాలలకు ఫర్నిచర్ అందజేత



సరిపల్లె పాఠశాలకు ప్లాస్టిక్ కుర్చీలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గణపవరం: మండలంలోని సరిపల్లెలోని ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు శనివారం ఫర్నిచర్‌తో పాటు విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. అలాగే గణపవరం బాలురు, బాలికల సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు రగ్గులు, గదులలో సీలింగ్ ఫ్యాన్‌లు అందించారు. బువ్వనపల్లి హైస్కూల్‌కు సీలింగ్‌ఫ్యాన్‌లు అందించారు. స్థానిక పోస్టాఫీసులో వినియోగదారులు కూర్చోవడానికి ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు కాకర్ల వినాయక, కోశాధికారి కె.సత్యనారాయణమూర్తి, సభ్యులు విశారద, రావూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో..

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సర్పంచ్ కురెళ్ల వెంకట రత్నం అన్నారు. శనివారం జల్లికొమ్మర జెడ్పీస్కూల్లో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాతలు మొఖమట్ల నాగసీతారాముడు, కురెళ్ల సత్తిరాజులు రూ.50 వేలు విలువైన 20 కుర్చీలు,ఆఫీస్ బీరువా, ఆఫీస్ టేబుల్, చైర్‌ను ఆ పాఠశాల హెచ్‌ఎం పుప్పాల ప్రకాశరావుకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మద్దాల మహంకాళి మాజీ సర్పంచ్ కోదండ రాంబాబు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు పరామర్శ



హారికను పరామర్శిస్తున్న దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై జరిగిన దాడి, దౌర్జన్యం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రజాప్రతినిధులతో కలిసి హారిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే బీసీ సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించి, హారిక కుటుంబానికి రాష్ట్ర బీసీ సంఘం, బీసీ కుటుంబ సభ్యులంతా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు, పెదవేగి ఎంపీపీ తాతా రమ్యశ్రీ, నాయకులు బెజవాడ నరసింహారావు, టి.సుజాత, లక్ష్మి, సింహాద్రి బేబీ, కొలుసు గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావంతో ఉండాలి



రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ నతానియేలు

దెందులూరు: విద్యార్థులు సమాజంపై సేవాభావంతో ఉండాలని ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్ అన్నారు. శనివారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నతానియేలు అధ్యక్షతన రోల్ ఆఫ్ యూత్ ఇన్ కమ్యూనిటీ సర్వీస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పాల్ స్టేట్ లెవెల్ టీచర్ ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణను ప్రతి ఒక్కరూ నిరంతర సాధన పరిశీలన క్రమశిక్షణతో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. అనంతరం ఎస్‌ఏడీ పాల్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.పోల్‌రెడ్డి, అధ్యాపకులు కుమార్, డి.రత్నబాబు, రాజమండ్రి ప్రభుత్వ బీఈడీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సోనియా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం



భీమడోలు: పూళ్లలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



గణపవరం: స్వచ్ఛత ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

భీమడోలు: ప్లాస్టిక్‌రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పూళ్ల వైద్యాధికారి డాక్టర్ పి.అరుణజ్యోతి అన్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వాడవాడలా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ర్యాలీలు, మానవహారాలు చేశారు. పూళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు పి.అరుణజ్యోతి ఆధ్వర్యంలో ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు పర్యవేక్షణలో ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పొలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్లోగన్స్ వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శి యుజే జయరామకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నిషియన్ ఆనంద్ పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే ప్లాస్టిక్ వస్తువుల ఏరివేత కార్యక్రమం అంకితభావంతో జరగాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శని వారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయం, వీరమాచినేని పుష్ప కళ్యాణ్ మండపం సాయిబాబా గుడి రోడ్డులో అధికారులు స్వయంగా ప్లాస్టిక్ కవర్లను ఏరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: ప్లాస్టిక్ మనుగడ మనుషులతో పాటు ఇతర జీవరాశుల మనుగడకు కూడా ముప్పు తెస్తుందని, అందువలన ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా వదిలివేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాధ్ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్ పాల్గొన్నారు.

పెదపాడులో..

పెదపాడు: ప్లాస్టిక్‌రహిత పరిసరాలపై విద్యార్థులు అవగాహనతో ఉండాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. శనివారం సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చైర్‌పర్సన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలందరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని జిల్లా వైద్యశాఖాధికారి పీజే అమృతం తెలిపారు. శనివారం వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వట్లూరు వైద్యాధికారి సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.